

# అనగనగా ఓ మంచి కథ

# కదంబమాల

## కోడూరి కౌసల్యాదేవి

(1962 యువ మాసపత్రిక, దీపావళి సంచిక నుంచి)




మలయపవనం లోకవిహారార్థం బయలుదేరే ప్రాతః సమయం. ఎటు తిలకించినా పచ్చని చెట్లతో పూలబాలల ముగ్ధ సౌందర్యంతో, పక్షుల మధుర కూజితాలతో మనసును హాయిపరచే మధుర ప్రకృతి. ఆ ప్రకృతి సౌందర్యంలో లీనమై పరధ్యానంతో పూలుకోస్తున్న రమణి అలికిడి విని వెనుదిరిగి చూచింది. పైపు దగ్గరున్న అత్తగారి దృష్టి తనపైనే వుండడం గమనించింది. అంతలో హుకుంకూడ రానే వచ్చింది.

"అదేం చోద్యమే తల్లీ? అంత ఒయ్యారంగా ఎప్పటికొస్తావ్? ఎప్పటికి తెముల్తాయి పనులు? ఆ పిట్టల్నీ చెట్లనీ చూస్తూనిల్చోవడానికేమైనా సినీమా కన్పిస్తోందా వాటి ముఖాలలో?"

"వచ్చేస్తున్నానత్తయ్యా, అయిపోయింది." నందివర్ధనాలతో త్వరత్వరగా సజ్జ నింపసాగింది.

"అయ్యో! అయ్యో! త్వరగా అన్నానని మొగ్గలు, చిగుళ్ళు కూడ త్రుంచేస్తున్నావా? ఏం మాట్లాడినా తప్పే కదా ఈ కాలం వాళ్లతో!" బిందెతో లోపలికి వెళ్ళిపోయింది సుభద్ర.

అత్తగారు వెళ్ళినదిక్కే చూచి ఒక్కనిట్టూర్పు విడచి యింట్లోకి నడిచింది రమణి. తాతగారు అప్పటికే పూజ గదిలో దైవమందిరం వద్ద కూర్చుని వున్నారు. పూల సజ్జ ప్రక్కగా వుంచి మందిరం ముందు ముగ్గులు వేసి, ఏకాత్రిలో నెయ్యి, వత్తులూ వేసింది రమణి. క్రితదినం పూజచేసిన పూలు తీసివేస్తూ వెళ్ళిపోతున్న రమణిని పిల్చాడు అనంతయ్య

"చూడమ్మా."

గడప దాటుతున్న రమణి కాళ్ళు ఆగిపోయాయి. వెనుదిరిగి వచ్చి తాతగారి వద్ద నిల్చుంది. "అలాగ అన్నీ యిచ్చి నీ పని తీరిపోయినట్టు వెళ్ళిపోతావు. తెల్లవారి యిన్ని పనులు చేస్తామే, ఒక్క పది నిముషాలు ఆ దైవపూజకు వినియోగిస్తే ఎంత బాగుంటుంది, ఆలోచించు తల్లీ. అది జీవితానికెంతో సౌభాగ్యం చేకూర్చగలదు. ఎలాగూ వేకువతోనే లేస్తావు గదా! స్నానం చేసి రెండు పుష్పాలు ఆ భగవత్పాదాలకు సమర్పించితే ఎంత మేలు జరుగుతుందీ! హృదయమెంత నిర్మలంగా వుంటుందీ! "

దైవ విగ్రహాలను చూస్తూ మౌనంగా నిల్చుంది రమణి.

"ఏదో పెద్ద వాడిని గనుక చెప్తాను. ముందుముందు ఆ ప్రయోజనం. నీకే తెలుస్తుంది లేమ్మా, ఇంకా చిన్నతనం కదూ! అయితే నిత్యమల్లెలు పూయడం లేదా దొడ్లో?" మాట తప్పించాడు ముసలాయన. మనుమడి భార్య ముఖ కవళికలను గమనించి.

"నిత్యమల్లెలు పూయడం లేదండి." అంది రమణి.

"సాయంత్రం వేళల్లో నీకు పెద్ద పనేముంటుంది తల్లీ? కాస్త నాల్గురకాల మొక్కలూ వేసి, నీళ్ళు పోసి శ్రద్ధగా పెంచకూడదూ? దొడ్లో పూశాయన్న తృప్తీ మిగుల్తుంది, అందానికందమూ వస్తుంది యింటికి, నీ దేహానికీ మంచి పరిశ్రమ".

నిట్టూర్పును బలవంతంగా లోలోపలే అణచుకుంది రమణి. "అలాగేనండి" తప్పనిసరిగా అంటూ బయటపడి వంటగదిలోకి నడచింది.

కుంపటి రాజేస్తుంటే అత్తగారు వచ్చింది. నీళ్ళబిందె దింపి క్రింద వుంచుతూ "ఇంత సేపట్నుంచీ ఏం చేస్తున్నావ్? మళ్ళీ ఏ పిట్టల్నైనా చూస్తూ కూర్చున్నావా? ఇప్పుడు కుంపటి వెలిగించితే వంట ఎప్పటికౌతుంది? స్కూళ్ళకూ ఆఫీసులకూ వెళ్ళే వాళ్ళందర్నీ ఎప్పుడు సవరించి పంపేది? అయ్యో అందం !" బుగ్గలు నొక్కుకుంటూ కుంపటి దగ్గర చతికిలపడింది. "చాల్లే. నేను చూచుకుంటానుగానీ కూరలబుట్టా, కత్తిపీటా యిలా తెచ్చి పడెయ్యికాస్త."

మౌనంగా వెళ్ళిపోయింది రమణి. అంతలో పూజగదిలోంచి తాతగారి కేక విన్పించింది.

"ఏమమ్మా, కొబ్బరికాయా, హారతి కర్పూరం ఏవీ?"

తన మతి మరుపుకు విసుక్కుంటూ రమణి త్వరత్వరగా వెళ్ళి అలమార్లోవున్న అగరువత్తులూ, టెంకాయా, హారతి కర్పూరం తీసిచ్చింది. టెంకాయ కొట్టి నైవేద్యం పెట్టి హారతి వెలిగించేవరకూ వుండి, నీరాజనం భక్తిగా కళ్ళకద్దుకు నమస్కరించింది రమణి. తాతగారిచ్చిన కుంకుమా, పూజాపుష్పాలూ తీసుకుని తిరిగి కూరల బుట్టలతో వంటింట్లోకి నడిచింది.

"అంత చీమనడకైతే ఎలాగే పిల్లా? ఆ గదిలో దీ గదిలోకి తెచ్చి పడేసేందుకు కింత సేపా? పైగా ఎన్నన్నా సమాధానం చెప్పవు కదా" అంది అత్తగారు.

"తాతగారు పిలిస్తే వెళ్ళాను, పూజ వస్తువులు యివ్వడానికి." మెల్లగా అంది రమణి.

"తాతగారి పనులూ చూడొచ్చు, నా పనులూ చూడవచ్చు, చకచకా చేసుకోవాలి పనులు" ఆమె యింకా ఏమో అంటూనే వుంది కాని భర్త పిలుపు విని వెళ్ళిపోయింది రమణి "తెల్లవారి అప్పుడే యిద్దరి దగ్గర నాలుగు పాఠాలు నేర్చుకున్నాను" అనుకొంటూ.

"రమా! ఓరమా! రమణీ!" వెళ్ళేలోగానే ఏడెనిమిది కేకలు వేశాడు సారథి. "అబ్బబ్బ, ప్రొద్దున్నే నేను లేచేప్పటికే కాస్త పేస్టూ, బ్రష్షూ సిద్ధం చేసి వుంచకూడదా రమా? లేస్తూనే కేకలు పెట్టించుకోకపోతే, లేచేసరికి కాస్త ఎదురుగా కాఫీ కప్పుతో కళకళలాడ్తూ నిల్చుంటే ఎంత సంతోషంగా వుంటుంది నాకు?"

నవ్వింది రమణి. "అసలు హాయిగా తీయగా మేల్కొలుపులుపాడుతూ నిద్ర లేపితే యింకా బాగుంటుందేమో?" అంది బ్రష్ అందిస్తూ.

"ఆహాహా, అదృష్టమంతా నాదే. అయితే రేపట్నుంచి నీ పాట విన్పించనిదే కళ్ళే విప్పను." నవ్వుతూ వరండాలోకి నడిచాడు సారథి ముఖం కడగటానికి.

"తేగలా చిక్కిపోయావంటే తేగ కావాలనేడ్చిందట వెనుకటికి" అంటూ గది సర్దడానికుపక్రమించింది రమణి. ప్రక్క పై దుప్పటి దులిపి పరచి టేబుల్ క్లాత్ సర్దింది. చిందరవందరగా నున్న మేగజైన్లు దొంతిపెట్టి కాఫీ తేవడానికి వెళ్ళింది. ఆమె కాఫీతో తిరిగి వచ్చేసరికి సారథి విసుగ్గా స్టాండుమీది బట్టలన్నీ తీసి చిరగ్గా గిరవాటేసేస్తున్నాడు.

"ఏం కావాలి?" అడిగింది రమణి కాఫీ డ్రాయర్ మీదుంచుతూ.

"నీకింత పరధ్యానమేమిటి రమా? ఒకటిస్తే రెండివ్వవు. నీ దృష్టీ ఆలోచనలూ ఎక్కడుంటాయో మరి, నాకు తెలియదు. టవల్ ఎక్కడుందో కాస్త చూడు. " విసుగ్గా మంచం మీద కూర్చున్నాడు.

మాట్లాడకుండా క్షణంలో స్టాండు మీద టవల్ తీసిచ్చింది రమణి, "అరె! నాక్కన్పించలేదేం, ఎంతవెతికినా ?" అంటూ అందుకున్నాడు.

"అవును మరి, కోడలు రాగానే మన కుటుంబాలు పని పాటలు మర్చిపోతాయి. కోడలు దాసీదైపోతుంది." అంది రమణి నిష్ఠూరంగా.

గలగలా నవ్వాడు సారధి కాఫీ చేతికి తీసుకుంటూ. "చాలా కుటుంబాలకు నువ్వు చెప్పిన విషయం అన్వయిస్తుంది. కానీ మన కుటుంబం విషయంలో అది నిజం కాదని చెప్తున్నాను రమణీ. ఈ యింట్లో ప్రతి ఒక్కరికీ నువ్వంటే ఎంతభిమామో నీకింకా తెలియలేదు. అందరూ 'రమణీ, రమణీ' అంటూ ప్రేమగా అభిమానంగా పిలుస్తూ అనేక పనులకు నీ పై ఆధార పడ్తున్నారన్న సంగతి గుర్తించి, నీ హృదయం సంతోష పులకితమవ్వడం లేదూ?"

నిజమే నన్పించింది రమణికి. తనకింత వరకు ఈ విషయం తట్టనందుకు లోలోన మధనపడింది. ఆమె ఎదలో మెదిలో భావాలు కన్నులలో ద్యోతకమయ్యాయేమో మరి సారధికి. "ఇంకెప్పుడూ అలా విసుక్కోవు కదూ?" అన్నాడు రమణి కండ్లలోకి చూస్తూ. అంతే – ఆ చిరునవ్వుతో రమణి హృదయం ఆనందమరీచికలలో డోలలాడింది. స్నానం చేసి వచ్చేసరికి సంతోషంగా భర్తకు కావలసిన దుస్తులు తీసిచ్చింది. అతడిని సంతోషంగా ఆఫీసుకు సాగనంపి వంట గదిలోకొచ్చింది.

"ఏం తల్లీ, అయ్యిందా మొగ్గుణ్ణి వీధి వరకూ సాగనంపటం? కాస్త ఏమైనా సాయం చెయ్యగలవా నాకు?" అంది సుభద్ర రమణిని చురచుర చూస్తూ. అత్తగారి మాటలకు కోపం వచ్చినా రమణి మాట్లాడలేదు. కాఫీ గ్లాసులు కడిగిపెట్టి, బియ్యం కడుగుతూండగా చిన్న ఆడపడుచు వచ్చింది, 'జడ వెయ్యివదినా." అంటూ.

"వస్తున్నా" అని రమణి లేవబోతూండగా సుభద్రమ్మ మాటలతోనే అడ్డుపడింది.

"ఇక్కడి పని చూడు. నేను వెళ్తాన్లే."

"వదిననే రానియ్యమ్మా, అందంగా వేస్తుంది." అంది లక్ష్మి.

"నోర్మూయ్, భడవా, ఇపట్నుంచీ షోకులుంటేనేకాని తర్వాత గ్రంధకర్తవవ్వవు." ఒక్కటి మొట్టి కూతుర్ని బయట కీడ్చుకెళ్లింది సుభద్ర.

ఒక్క క్షణం నివ్వెరపోయింది రమణి. 'ఆ మాట లక్ష్మీనా లేక నన్నా?' ఆనందంగా వున్న మనస్సు ఒక్కసారి కల్లోలమైపోయి విషాద వీచికలు రేగాయి, 'అడుగడుగునా సాధింపే; సూటిపోటిమాటలే. కోడలంటే ఎందుకో యింత అసహ్యం ఈ దేశస్థులకు? సారధి లెక్క ప్రకారం యివన్నీ అభిమానమూ, ఆప్యాయతల చిన్నెలేనా?' అప్రయత్నంగా నవ్వొచ్చింది రమణికి. 'ఎంత సునాయసంగా మురిపించి మత్తెక్కించేస్తారు ఈ పురుషులు! వాళ్ల మాటలకూ, చిరునగవులకే మైమరచిపోయే ఈ ఆడవాళ్ళనెలా సృష్టించాడో దేవుడు? బహుశః అతడు కూడా మగవాడు గనుకనేమో!"

"ఏమిటొదినోయ్, నీలో నువ్వే నవ్వేసుకుంటున్నావ్?" మరది పల్కరింపుతో వులిక్కిపడి తలెత్తి చూచింది. చేతిలో పుస్తకాలతో శ్రీను నిలబడి వున్నాడు.

"కొంచం ఈ లెక్క చెప్పవ్ వదినా?"

"ఇప్పుడే కావాలా?" విసుగ్గా పెట్టింది ముఖం.

"మేష్టారు కోప్పడ్తారేమో వదినా!" జాలిగా చూశాడు.

"సరే. రా. యిలా కూర్చో." తప్పని సరిగా అంది. లెక్కలు చెప్పాలనికానీ అసలు ఏ పనీ చెయ్యాలనికానీ ఆమెకు లేదు. ఎందువల్లనో పరధ్యానం ఎక్కువైపోయింది, కానీ తప్పదు; అర్థించుతున్నవాడు మరది! సాక్షాత్తూ భర్తకు తమ్ముడు. మామూలు కోడళ్ళందరికంటే చదువుకున్న కోడలికి మరో అదనపు యిబ్బందన్నమాట!

"ఏమిటొదినా, లెక్క చెప్పమంటే ఎటో చూస్తావ్."

తిరిగి శ్రీను మాట్లాడంతో జాగ్రత్త పడింది రమణి. "చెప్తాను, వరుసగా స్టెప్పు వెయ్యి."

వదిన టక టకా లెక్క చెప్పెయ్యడం చూచి ఆశ్చర్య పడిపోయాడు శ్రీను. "ఈ లెక్క నిన్న మా మాష్టారికి కూడా రాలేదు వదినా. ఇవ్వాళ చూద్దామని వదిలేశారు. నువ్వు కాలేజీలో చదువుకోవల్సింది. స్కూల్ ఫైనల్ తర్వాత్."

నిట్టూర్చుతూ తలపంకించింది రమణి.

"ఓహ్, ఇవ్వాళ నాకెంత 'క్రెడిట్' క్లాసులో ! మాష్టారికే రాని లెక్క మా వదిన చెప్పిందంటే!" శ్రీను గెంతుతూ వెళ్ళిపోయాడు.

"చిన్నవాడు – శ్రీనుకేం తెల్సు? తెలివైన వాళ్ళందరకూ చదువుకొనే అవకాశాలుంటాయా?" ఒక్కసారి మనస్సు హైస్కూల్లో చదువుకొనే రోజులలోకి పరుగెత్తింది. అన్నింటిలోనూ ఫస్టుమార్కులు తెచ్చుకుంటూ పెద్ద చదువులు చదవాలని వూహించుకుని మురిసిపోయేది. స్కూల్ ఫైనల్ పరీక్షలో స్కూలుకు "టోటల్ ఫస్ట్' తో పాసైంది. తమకేమీ ధనలోపం కూడా లేదు. హాయిగా చదువుకోగల అవకాశాలు బోలెడు. అయితేనేం, 'ఆడపిల్ల కాచదువుచాలు' అన్నారు యింట్లో అందరూ. పెద్దలంతా ముక్తకంఠంతో శాసించిన ఫలితంగా చదువాగిపోయింది. తర్వాత రెండేళ్ళు యింట్లో సంగీతం చెప్పించారు. కాని చదువుమీదున్న తన మనస్సుకు సంగీతం ఎక్కలేదు. ఈ సంవత్సరం పెళ్ళైంది. వచ్చేసింది అత్తవారింటికి. పుట్టింట్లో చదువుకోలేకపోయానన్న బాధే వుండేది. ఇక్కడికొచ్చాక యింకా ఎన్ని రకాలు! ఎన్ని చేసినా ఒక్కరికీ తృప్తి వుండదు. పైగా అడుగడుగనా ప్రతిపనిలోనూ వంకలు వెదకడం, సాధింపులూ, నీతిబోధలూనూ. తన తప్పులుకూడా వుండక పోవు. ఎంత ప్రయత్నించినా చేసేపనిలో మనసు నిలువదు; ఆలోచన లెక్కడుంటాయో తనకే తెలీదు. పుట్టింట్లో చూచీ చూడనట్టు వదిలేసేవారు; చిన్నతనమని సరిపెట్టుకొనే వారు. ఇక్కడ మాత్రం ప్రతిలోపాన్నీ ఎత్తి చూపిస్తారు. అదే తనకు బాధగా వుంటోంది.

"అయ్యో, అయ్యో! యిదెక్కడి దారుణమే?" సుభద్ర కేకలకు భయోద్వేగాలతో ఖంగారుగా లేచి నిలబడి చుట్టూ చూచింది. అన్నం ఎప్పుడనగా పొంగువచ్చిందో మరి, పొయ్యిలోకి పొంగిపోయింది చాలా వరకు; పొయ్యి ఆరిపోయింది.

"చూడలేదండీ!" అంది పశ్చాత్తాపంగా.

"నీ చూపు లెక్కడో వుంటాయి. నువ్వెక్కడ చూస్తావ్? అయినా నీలాంటి దాన్ని నమ్మి ఒప్పజెప్పడం నాదే బుద్ధితక్కువ" నుదురు కొట్టుకుంటూ గిన్నెదింపి గబగబా వార్చింది సుభద్రమ్మ. మౌనంగా నిల్చున్న కోడలికేసి చూచి "నీ చూపు లెక్కడో వుంటాయి. నువ్విక్కడుంటే యేదో ఒకటి చెప్పబుద్ధి అవుతుంది. నువ్వసలిటువేపుకు రాకు తల్లీ" అంది. ఆ మాట తీరని అవమానంగా తోచింది రమణికి. తల ఒంచుకుని మెల్లగా బయటకు వెళ్ళిపోయింది.

"అమ్మాయి, రమణీ!" తన గదిలోకి వెళ్ళిపోతున్న రమణి మామగారి కేక విని నిస్సహాయంగా ఆయన గదివేపు నడిచింది. "చూడమ్మా, కాస్త నా పెన్నులో సిరాపోసి పెట్టు". సిరాతో నింపి, పెన్నుయిచ్చి వెళ్ళిపోతున్న కోడల్ని తిరిగి వెనక్కు పిలుస్తూ "చూడమ్మా, అమ్మాయిలకూ అబ్బాయిలకూ వాళ్ళ పనులేవో వాళ్ళకుంటాయి. స్కూళ్ళనీ, ఆఫీసనీ, నువ్వు తీరికగా వుంటావు కదా, కాస్త నేను కోర్టుకు వెళ్ళే టైముకు పెన్ను, జేబురుమాలూ, కళ్ళజోడూ లాంటివి కాస్త సిద్ధంగా వుంచకూడదటమ్మా? తీరికగా కూర్చుంటే నీకు మాత్రం మేం తోస్తుంది?"

'స్కూలు, ఆఫీసు, కోర్టు!' ఈ మూడూ మినహా గోవిందరావు దృష్టిలో యింకేమీ లేవు. ఇంటిదగ్గరుండేవాళ్ళందరూ తీరుబడి గానే కాలం గడవక కొట్టుకుంటారనుకుంటుంది, అతడి ప్లీడరీ మెదడు.

పైకి ప్రకాశంగా "అలాగేనండి" అంటూ వెళ్ళిపోయింది రమణి, లోపల "పాఠం నెంబరు ఆరు" అనుకుంటూ.

భోజనం చేస్తూ "అన్నం యిలా ముద్దపోయిందేమిటి?" అన్నాడు గోవిందరావు.

"చదువుకున్న కోడలి వంట!" అంది సుభద్రమ్మ. మామగారి దగ్గర మంచి నీరూ, నెయ్యీవుంచుతున్న రమణి ముఖమెత్తలేదు. గోవిందరావు మరిమాట్లాడలేదు. పిల్లలు, పెద్దలు ఒక్కొక్కరే భోజనానికొచ్చి వెళ్తున్నారు. గ్రామఫోను ప్లేటులా అందరినుంచీ వస్తున్న ఒకే ప్రశ్నకు సుభద్రమ్మ 'డిటో' సమాధానాలు వినీ వినీ రమణి ముఖం భూమిలోకి క్రుంగిపోయింది. లోపల ఏదో దిగులు. అన్నం సహించలేదు. తినీ తినకుండా లేచిపోయింది.

"ఓ పనీ చేతకాదు. తిండితినడం ముందే చేతకాదు. మరీ యింత నాజూకా? ఇంతకంటె మరి యింకేం అమృతం చేసిపెట్టి తినిపించేదో మరి మీ అమ్మ, నాకు తెలియదు!" అంది సుభద్ర.

అత్తగారి మాటలు నవ్వు తెప్పించాయి రమణికి. "తిండిక్కూడా నాజుకేమిటి? ఛాదస్తం కాకపోతే!"

"దానిమాటల కేంలె మ్మనా అలా నీలో నువ్వు నవ్వుకుంటున్నావ్?"

"భగవాన్!" అనుకుంటూ నిట్టూర్చింది రమణి.

మధ్యాహ్నం సారధి భోజనానికొచ్చాడు. రమణి వడ్డిస్తూంటే సుభద్ర గడప కవతల చెంగుపరచుకు పడుకుని లోకాభిరామాయణం చెప్పసాగింది. తమకు తెలిసిన వారి కోడళ్ళు ఎవరెంత కట్నం తెచ్చారో, ఎవరెవరి కెంతంత బాగా పనిపాట లొచ్చునో, అనేదే సంభాషణ సారాంశం.

సారధి అన్నం చేత్తోపట్టుకుని ఒక్కసారి రమణి ముఖంలోకి చూచాడు. అన్యాపదేశంగా తల్లి చెప్తూన్న కబుర్లలో అంతరార్ధం అతడికి బోధపడింది. రమణి సూటిగా చూడలేకపోయింది. అంతవరకూ ఏడెనిమిసార్లు జరిగిన గ్రాంఫోను ప్లేటు సంభాషణ మళ్ళీ వినవస్తుందనే భయంతో త్వరత్వరగా చేతులు కొంగున తుడుచుకుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది రమణి.

"అయ్యో, అలా వెళ్ళిపోతావేమిటే? మొగుడికి అన్నం పెట్టి కాస్త ఏం కావాలో కనుక్కోవద్దూ? అయ్యోరాత. కోడలొచ్చినా నా పాట్లు నాకు తప్పవు." విసుక్కుంటూ లేచింది సుభద్ర కొడుకు భోజనం విషయం చూడటానికి. అత్తగారి మాటలు విన్పించాయి రమణికి. కాని విననట్టే వెళ్ళిపోయింది.

సారధి భోజనం ముగించి వచ్చేసరికి రమణి కిటికీ దగ్గర నిల్చుని వీధిలోకి చూస్తోంది. భర్త వచ్చినట్టు తెల్సినా వెనుదిరిగి చూడలేదు. అయిదు నిముషాలపాటు సారధి కూడ మాట్లాడలేదు. మెల్లగా రేడియో పెట్టాడు. అయినా రమణి దృష్టి కదలలేదు.

"ఏమిటంత పరధ్యానం?" మెల్లగా వెళ్ళి ఆమె వెనుక నిల్చుని ప్రశ్నించాడు.

"ఏమీ లేదు." ఇంకా రమణి చూపులు దూరానికే నిగిడ్చివున్నాయి.

తనూ ఆమె దృష్టి ననుసరించి బయటకు చూచాడు. ఎదురుగానున్న హైస్కూలు పిల్లల్ని వదిలేశారు; అంతా బిలబిలా యిళ్ళకు వెళ్ళిపోతున్నారు. ఏడేనిమిదేళ్ళ పిల్లల నుంచి పాతికేళ్ళవాళ్ళవరకు వున్నారు విద్యార్థులు. అందరూ సంతోషంగా సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. రమణి హృదయంలోని భావతరంగాలను సారధి అర్ధంజేసుకోగలిగాడు.

"నీకింకా చదువుకోవాలని వుందా?" అన్నాడు భుజం పై చెయ్యివేస్తూ.

"ఉంటే మాత్రం ఎలా సాగుతుంది?" నిరాశగా అంది రమణి.

"చదువంటే నీకింత అభిలాష అని నేనెప్పుడూ అనుకోలేదు రమా."

"-------------------------------------."

"స్కూల్ ఫైనల్ మంచి మార్కులతోనే పాసయ్యావుకదా ! చదువుకోలేక పోయావా? మీ వాళ్ళకూ ధన లోపమేమీ లేదుకదా?"

"ధనలోపం లేదుకనుకనే మీలాంటి పెళ్ళికొడుకొను వేలకు వేలు పోసి అల్లుడుగా పొందగలిగారు!" చికాకుతో వేగిపోయిన హృదయం సంభాషణలో జాగ్రత్త వహించలేకపోయింది.

దెబ్బతిన్నట్టు చూచాడు సారధి. తిరిగి ఏదో సమాధానం చెప్దామనుకున్నాడు. కాని ఏమీ మాట్లాడలేకపోయాడు. వెళ్ళి మౌనంగా ఆఫీసు దుస్తులు వేసుకోసాగాడు. వెళ్తూ వెళ్తూ గుమ్మం దగ్గర ఆగాడు. "ఒక్క మాట రమణీ. నేను కాకపోతే నా స్ధానే మరొకడినైనా కొనుక్కునివుండే వారు మీ వాళ్ళు. అంచేత అపరాధం నాది కాదు." అంటూనే సాగిపోయాడు. కాని ఆ బాణానికి రమణి ముఖం ఎంత వాడి పోయిందో అతడు చూడలేదు.

ఆఫీసులో కూడా సారధి కుదురుగా కూర్చోలేకపోయాడు. తన విద్యా సౌందర్య వ్యక్తిత్వ విషయాలలో అతడికి విశేషమైన నమ్మకం; తనను పొందగలగడం రమణి ఆమె అదృష్టంగా భావిస్తుందని అతడు వివాహాత్పూర్వం నుంచీ భావిస్తున్నాడు. అది ఆత్మగౌరవమే కావచ్చు. లేక అహం భావమే కావచ్చు. అటువంటి స్వభావంకల సారధి అహం నేడు భార్య మాటల వల్ల దెబ్బతిన్నది. కాని అతడిది అంత తేలికగా తొందరపడే స్వభావం కాదు.

భర్తకు తన మాటలు కోపం కల్గించాయని భయపడిన రమణి, సాయంకాలం సారధి వస్తూనే రెండు పుస్తకాలందివ్వడంతో కొంత ఆశ్చర్యపడింది; సంతోషించింది కూడా. ఆత్రుతగా తెరచి చూచింది. ఒకటి రవీంద్రుని 'గోరా', రెండవది బాపిరాజు గారి 'నారాయణరావు.'

"నిన్నటి వరకు పుస్తకాలు, ఆటపాటలతో గడిపినదానవు — హఠాత్తుగా సంసారంలో కట్టిపడేస్తే యిమడలేక పోతున్నావు. మంచి పుస్తకాలు నీ కోసమే కొని తెచ్చాను. తీరికవేళల్లో చదువుకో." భర్త మాటలకు రమణి సంతోషంగా తలెత్తి చూచేసరికి సారధి కూజాలో మంచి నీరు గ్లాసులో ఒంచుకు త్రాగుతున్నాడు. ఆమె ముఖంలో సంతోషపూర్వకహాసం మాయమైంది. తాను కాపురానికొచ్చిన రెండునెలలోను జరుగని పని అది! ఉదయం భర్తలేచేసరికి బ్రష్ మీద పేస్టు వేసి యివ్వడం దగర్నుంచీ రాత్రి అతడు వ్రాసుకుంటూ చదువుకుంటూ జార విడిచేసిన పెన్ను, పుస్తకాలు పదిలం చేసి లైట్ 'ఆఫ్' చెయ్యడం

వరకూ తనే చెయ్యాలి. నిజానికవన్నీ చెయ్యటం తన కంత యిష్టం లేకపోయినా శ్రద్ధలేక పోయినా సారధి చెప్పి చేయించుకుంటాడు. "ఒక్కసారధేమిటి? ఈ యింట్లో అందరూ తనకు ఎన్నో పనులు చెప్పిచేయించుకొనే వాళ్లే!" అనుకొంటూంటే తిరిగి రమణి మనస్సు కఠినమైపోయింది. మౌనంగా కాఫీ టిఫిన్ తెచ్చి అందించింది. సారధి ఎక్కువగా ఏమీ మాట్లాడలేదు. ప్రతిదినం ఎన్నో విశేషాలు నవ్వుతూ సరదాగా మాట్లాడే అతడి మౌనం రమణికి కొద్ది బాధకల్గించినా పైకి ఏమీ మాట్లాడలేదు.

రాత్రి భోజనాంతరం 'గోరా' చదువుతూ కూర్చున్న రమణికి కాలగమనం తెలియలేదు. కాని రేడియో "ఇక యివ్వాల్టికి నాపనైపోయింది. తీసెయ్యి 'మొర్రో' " మని అరచినట్టు 'బర్' మంటూ భరింపరాని శబ్దం చెయ్యడం విన్పించి వులిక్కి పడి స్విచ్ కట్టేసింది. చదువుపాడైనందుకు విసుక్కుంటూ టైముచూచింది. పన్నెండున్నర తాటుతోంది. సారధి నిర్మలంగా నిద్రపోతున్నాడు. వ్రాస్తున్న కాగితాలు, చదువుతున్న పుస్తకాలు, పెన్ను ఎక్కడిక్కడ వదిలేసి నిద్రపోయేవాడల్లా యివ్వాళ శ్రద్ధగా సర్దుకుని మరీ పడుకున్నాడు. "ఏమిటీ మార్పు!" ఆలోచిస్తూ పడుకుంది.

మరునాటి ఉదయం రమణి నిద్రలేచేసరికి ఎనిమిదైంది. అప్పటికే ఆఫీసుకు వెళ్ళిపోయాడు. "లేపకూడదు కాబోలు!" అనుకుంది రమణి కోపంగా. పుట్టింటిలో తొమ్మిది గంటలు కూడా లేచే అలవాటుండేది కాని, అత్తవారింటి దగ్గర ఈ రెండునెలల నుంచీ అయిదుగంటలకే లేవడం అలవాటుగా వుంటోంది. అంచేత ఏదో తప్పు చేసిన దానిలా బాధపడింది. తన కోసం ఏ పనీ ఆగలేదు. పూజ అయి తాతగారు తీరికగా పేపరు చూస్తున్నారు. అత్తగారి వంట అవుతూ అవుతూవుంది. భర్త ఆఫీసుకు వెళ్ళాడు. మరదలూ, ఆడపడుచులూ చదువుకుంటున్నారు.

"ఒంట్లో బాగాలేదా?" అని పలకరిస్తూ ప్రతి ఒక్కరూ ఆమె ఆలస్యంగా లేచిన విషయం గుర్తుచేశారు.

ఆ రోజునుండీ రమణీ సారధీల మధ్య మాటలు బాగా తగ్గిపోయాయి. తనపనులు తానే చేసుకుంటున్నాడు. లేదా చెళ్ళెళ్ళకో తల్లికో చెప్పి చేయించుకుంటున్నాడు. కాని రమణికి చెప్పటం లేదు. అలాగని అయిష్టమూ లేదు; ప్రేమ సహృద్భావాలకేమీ లోటులేదు. అతడు ప్రతిపనీ చెప్పి చేయించుకున్నప్పుడు బాధపడిన రమణి యిప్పుడతడు పనులు ఫర్మాయించటంలేదే అని బాధపడసాగింది.

"మీరు చాలా ముభావంగా వుంటున్నారు." అంది ఒకనాడు సారధితో.

"ఓహో!" అన్నాడు సారధి.

"అది చెయ్యి, యిది చెయ్యి, అని చేయించుకొనేవారల్లా మీ పనులన్నీ మీరే చేసుకుంటున్నారెందుచేత?"

అదొక మాదిరిగా నవ్వి వూరుకున్నాడు సారధి.

"ఏం, అసలంత ముభావంగా వుంటున్నారు నాతో?" రెట్టించింది రమణి.

మాట మార్చాడు సారధి. "నేను తెచ్చిన పుస్తకాలు చదవడమైపోయిందా? క్రొత్తవి తెస్తానులే."

అందలి నిగూఢ గర్భితమైన ఎత్తిపొడుపుకు రమణి దెబ్బతిన్నట్లు చూచింది.

"కాలక్షేపానికి పుస్తకాలు లేవుగనుక నాతో మాటలు, ఆలన పాలనలు కావలసి వచ్చాయా?" అన్నట్లుంది ఆ మాటల అంతరార్థం ! అతడావుద్దేశంతొ అనినా అనకపోయినా రమణికి కోపం వచ్చింది. దెబ్బతిన్న అహం ఆమెను మౌనం వహించనీయలేదు. "నా పనులు నచ్చక, నా నుండి తప్పించుకోవటానికి పుస్తకాలు తెచ్చి అంట గడ్తున్నారా?" అంది తీవ్రంగా.

ఈసారి సారధి సున్నిత హృదయం గాయపడ్డట్టు అతడి నేత్రాలు స్పష్టంగా ప్రదర్శించాయి. కొద్ది సేపు అతడేం మాట్లాడలేదు. తర్వాత మెల్లగా అన్నాడు. "నీ మాదిరిగా అనాలోచితంగా మాట్లాడి నేను బాధించలేను రమణీ. సహృదయంతో చేసిన పనులను విపరీతార్థాలతో వ్యాఖ్యానించడం నీకే చెల్లింది. ఆవేశంతో, తెలివితక్కువతో ఎంతటి ఆప్తులైనా మాటలతో చేతలలో గాయపరచుకుంటారు కొందరు కొందరు. సున్నితమూ, మధురమూ లోపించిన అటువంటి సంసారాలూ, స్నేహాలూ నా దృష్టిలో పరిహాసాస్పదం. ఒకసారి ఆకాశానికెత్తిన నోటితో మరొకసారి భూపతనం చేయడం సంస్కార లక్షణం కాదు రమణీ. అమృతమూ, హాలాహలమూ ఎప్పుడూ తమ తమ నిర్దిష్ట స్థానాలలోనే వుండాలి. వాటికి స్థానచలనం కలిగితే అంతా అరిష్టమే."

"ఓహో ! ఎంత బాగా చెప్పారూ! మరి యిన్ని తెల్సిన వారికి కోపం ఎందుకో? అస్తమానం 'రమణీ రమణీ' అని పిలచిన నోరు పిలచినట్టే వుండేది. పిలుస్తున్నారా, పనులు చెప్తున్నారా ? ఎందుకొచ్చింది మీలో ఈ మార్పు?"

"నువ్వు నా ఓర్పును పరీక్షిస్తున్నావ్; అంతే, నేను సమాధానం చెప్పకుండా తప్పించుకుందామన్న ప్రశ్నను నువ్వు మరీ మరీ రెట్టిస్తున్నావ్. పని చెయ్యాలనున్న వాళ్లు చెప్పించుకోకుండానే చేస్తారు. విసుక్కుంటూ మ్రొక్కుబడిగా చేసే పనులు కాదు నేను కోరేది; ప్రేమ పూరిత హృదయం, అనురాగ ప్రపుల్లమైన అంతరంగం. అది వున్న నాడు నా పట్ల నీ బాధ్యతలేమిటో వాటంతటవే తెలుస్తాయి. నేను చెప్పక్కర్లేదు."

"అయితే మీ పట్ల నా కనురాగం లేదంటారు?" తీక్ష్ణంగా అడిగింది రమణి. బరువుగా నిట్టూర్చి లేచి, ఎక్కడికో వెళ్లడానికి తయారవ్వ సాగాడు సారథి. దుస్తులు వేసుకుంటూ మెల్లగా అన్నాడు "ఎందుకు ప్రతీదీ రెట్టిస్తావ్ రమణీ? మన విషయాలు మన మధ్యనే వుండిపోవాలి కాని ఎంత ఆప్తులైనా మరెవరికీ తెలియకపోవడం మంచిది. మన వివాహమై యిప్పటికి సరిగా రెండు నెలలు. నిజంగా చాలా స్వల్పకాలమే. వ్యక్తులు జీవితాంతం కలసి వున్నా కొన్ని విషయాలలో కడపటి వరకూ ఒకరికొకరు అర్థం కాకుండానే వుంటారు. ఇక మన మధ్య అప్పుడే పూర్తిగా తెరలు తొలగిపోయాయనుకోవడం అవివేకం. వాగ్వాదాలూ, ఆవేశాలూ అనర్థాలకు మూలం కాని అర్థం చేసుకోవడానికుపయుక్తం కావు." సమాధానం కోసం చూడకుండానే వెళ్లిపోయాడు.

ఒక ఆదివారం సారథి తీరికగా గదిలోనే కూర్చున్నాడు. అక్కడే కూర్చుని రవీంద్రుని 'జోగాజోగ్' చదువుతున్న రమణి హఠాత్తుగా తలెత్తి "ఇందులో కుముదినీ మధుసూధనుల గురించి మీ అభిప్రాయమేమిటి?" అనడిగింది.

నవ్వాడు సారథి. "నాకు తెలియదు."

"అంటే?"

"ఆ పుస్తకాలు నేనప్పుడూ చదవలేదు. నవలలు చదివే అలవాటు లేదు నాకు."

"మరి యింతమంచి పుస్తకాలెలా ఏరి తేగల్గుతున్నారు?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"అదీ ఒక ఘనకార్యమేనా? ఏదో కాస్త మంచిదిమ్మంటే ఆ కొట్టువాడే ఎంచి యిస్తాడు !"

మరి మాట్లాడకుండా చదువుకోసాగింది రమణి.

"రమణీ !" అత్తగారి కేక విన్పించటంతో విసుక్కుంటూ పుస్తకం ప్రక్కన పెట్టి లేచి వెళ్ళింది. ఒక పావుగంటలో తిరిగి వచ్చిన రమణి మళ్లీ విసుక్కుంటూ తాతగారి పిలుపుకు లేచి వెళ్ళింది. పదినిముషాల్లో తిరిగి వచ్చి కూర్చుని మళ్ళీ పుస్తకం చేతబట్టింది. కాస్సేపటికి కాఫీఫలహారాలతో ప్రవేశించిన సుభద్ర విసుగ్గా కోడలి వంక చూచింది. "నీకు పెద్ద పని పాటలు చేయకపోయినా కాస్త నీకూ, నీ భర్తకూ ఏం కావాలో చూచుకొనే ఓపికైనా లేకపోతే ఎలా?" అంది.

రమణి మౌనంగా లేచి నిల్చుంది. మాట్లాడలేదు.

సుభద్ర ధాటి కొడుకు మీదకు త్రిప్పింది. "అయినా నువ్వెందుకా పుస్తకాలన్నీ తెచ్చిస్తా వబ్బాయ్? మరో దృష్టి లేకుండా ఆవిడేదో పెద్ద ఎమ్మే పరీక్షకు వెళ్తున్నట్టు చదవడం. లేకపోతే పని చెయ్యకుండా కూర్చోమని నువ్వే చెప్పావా, నాకు తెలీకడుగుతాను ?"

నిదానంగా అన్నాడు సారథి. "చేసే వాళ్ళు వద్దన్నా మానరు, చెయ్యనివాళ్ళు సాధించినా చెయ్యరు."

"ఆ ! " ఆశ్చర్యపోయింది సుభద్ర. "అయితే నీ పెళ్ళాన్ని ఏమీ అనొద్దని చెప్తున్నావా?"

"కోపమెందుకమ్మా? రమణి రాక ముందు మాత్రం గడచిపోలేదా? ఇప్పుడావిడ ప్రత్యేకంగా చేస్తేనేం, చెయ్యకపోతేనేం?"

క్రోధాశ్చర్యాలు అవధులు దాటి పోయాయి సుభద్రకు, "కోడళ్ళు మహారాణిలైన కాలం యిది!" ఈసడింపుగా యేమేమో అంటూ వెళ్ళిపోయింది.

నేలను బొటనవ్రేలితో రాస్తూన్న రమణిని ఒక్క క్షణం చూచి మెదలకుండా బయటకు వెళ్ళిపోయాడు సారథి. తనను ఓదార్చుతాడని ఆశించిన రమణి ఆశాభంగం అశ్రురూపం దాల్చింది.

రెండువారాల అనంతరం ఒకనాడు భోజనాల దగ్గర చెప్పాడు సారథి. "నాకు మద్రాసు ట్రాన్స్ ఫరైంది" అని. అంతా ఆశ్చర్యపోయారు.

గోవిందరావు అన్నాడు. "నాలుగేళ్ళ నుంచి చేస్తున్నావు, ఇది 'ట్రాన్స్ ఫర్' అవ్వదు సాధారణంగా. హఠాత్తుగా బదిలీ కావడేమిటి?"

సారథి మాట్లాడలేదు.

"పోనీ మీ ఆఫీసర్లెవరికైనా చెప్పి చూడనా, 'ట్రాన్స్ ఫర్' ఆపుజేసేట్టు?"

"వద్దునాన్నా. పోనీ వెళ్తే కొంత మార్పుగా వుంటుంది."

ఈసారి గోవిందరావు మౌనం వహించాడు. కాని సుభద్రమ్మ కంఠం ఖంగుమంది. "అతగాడు కావాలని బదిలీ చేయించుకుంటే మధ్యన మీ రిదౌతారు దేనికీ ? ఇక్కడుంటే పెళ్ళాం పనిపాటలు చేసి అరిగిపోతుందని భయం కాబోలు!"

ఎవ్వరూ మాట్లాడలేదు.

తర్వాత ఏకాంతంగా వున్నప్పుడు రమణి అడిగింది, "ట్రాన్స్ ఫరయినట్టు నాకు చెప్పలేదేం?" అని

"చెప్పానుగా?" అన్నాడు సారథి పొడిగా.

"జనాంతికంగా చెప్పటం, నాకు చెప్పటం ఒక్కటేనా?"

"-----------------------------"

"మీరే ప్రయత్నించి బదిలీ చేయించుకున్నారా?" అని అడుగుదామని నోటి వరకూ వచ్చింది. కాని అడగలేకపోయింది. రానురాను యిద్దరి మధ్యా అపోహలు పోవలసినదిపోయి అగాధాలే ఎక్కువవుతున్నాయని ఆమె అప్పుడప్పుడే గుర్తించుతోంది. అది ఎలా పోగొట్టుకోవాలో మాత్రం తెలియడం లేదు. ఏదో అత్యవసరమైతే చిన్న చిన్న సంభాషణలు మినహా, ఎక్కువగా మాట్లాడుకోవటం లేదు. కొంత సేపు మౌనం రాజ్యం చేశాక తిరిగి రమణి నిశ్శబ్దానికి భంగం కలిగించింది. "ఆ రోజు స్కూలు పిల్లల్ని చూస్తూ నేనేదో అన్నాను. అందుకే మీకోపమొచ్చింది కదూ? ఆనాటి నుంచే మీరు మరీ ముక్తసరిగా వుంటున్నారు. అవునా?"

సారథి ఒక్క క్షణం వూరుకుని "లోలోపల బాధపడి – బాధ పెట్టకుండా మనస్సులో మాట స్పష్టంగా చెప్పేసే వాళ్ళనే నేను హర్షిస్తాను. నాకు ఎవరిమీదా కోపం వుండదు." అన్నాడు.

"కోపం లేదంటూనే సాధించగలరు మౌనంగా." అని అనకుండా వుండలేక పోయింది రమణి.

నవ్వాడు సారథి. "నిర్మల కాసారంలో రాయి పడ్తుంది. అలలురేగి ప్రశాంతతను చెదరగొడ్తాయి. రాయివిసరిన వాళ్ళు ఆ అలల్ని ఆపలేరు. అవలోకించడమేకాని; ఆ రాయిని వెనక్కు తీసుకోనూలేరు. సరోవర గర్భంలో ఆ రాయి పూడిపోవాలి. తరంగ కలవరం సర్దుకుని పూర్వావస్థ నందడానికి కొంత వ్యవధి కావాలి."

రమణి మరి మాట్లాడలేకపోయింది. భావయుక్తమైన ఆ మాటలు ఎందుకో ఆమెకు కఠినంగా, హేళనగా విన్పించాయి.

మద్రాసు వెళ్ళేముందు రహస్యంగా తల్లితో అన్నాడు సారథి. "ఈ నాచర్య నీకు బాధాకరంగా వున్న మున్ముందు సంతోషప్రదం కాగలదని ఆశిస్తూన్నానమ్మా, పెద్దవారి అభిప్రాయాలకూ అధికారాలకూ పిన్నల కోరికలూ, మనోప్రవృత్తులూ భిన్నంగా వుండడంతో కుటుంబాలలో అశాంతి రేగుతుంది. సమన్వయం కుదిరి సామరస్యమేర్పడే వరకూ దూరంగా వుండడం మంచిదిగా తోచింది. ఒకవేళ నా ఆశ నిజంగా రూపొందికపోయినా నువ్వు బాధపడకూడదు. క్షమించాలి. సంతానం వల్ల తల్లిదండ్రులకు సుఖం కంటే కష్టమే ఎక్కువనుకుంటాను."

సుభద్ర కరిగిపోయింది. "నీపై ఎప్పుడూ కోపం లేదు బాబూ. ఎక్కడైనా సుఖంగా వుండడమే కావాలి. తరచు ఉత్తరాలు వ్రాయి." అంది.

"ఎప్పుడూ నీ పుస్తకాలూ, నీ లోకమే నీదికాని యింకేమీ తెలియదు. క్రొత్త ప్రదేశంలో ఒక్కళ్ళూ ఎలా వుంటారోయేమో?" అంటూ సాగనంపుతూన్న అత్తగారి మాటలకు రమణి మాట్లాడలేదు. కాని ఎందుకో తెలియని బాధా. భయమేఘశకలాలతో మనస్సు కలవరపడింది. ఆ వెను వెంటనే అస్పష్ట ఆనంద ఊహా వీచికలు చెలరేగడంతో మేఘం విడిపోగా ఆదిత్యుని కిరణాలవలె ఆశారేఖలు దీప్తిమంతమై ఆకాంతిలో భవిష్యత్తు ఉజ్వలంగా తోచి హృదయం తేలికైంది.

చిర్రెత్తించే ఎండతోబాటు ఆడపాతడపా కురిసే జడివానలతో వానాకాలం ప్రవేశించబోతోంది. ఆ ఆషాఢమాసపు ప్రకృతిలాగే రమణి మనస్సూ ఒక్కోసారి కుతుకుతలాడి ఒక్కోసారి శాంతపడసాగింది. వెళ్ళిన వారం రోజుల వరకూ మద్రాసు నగరమంతా త్రిప్పి చూపించాడు సారథి. ఊరంతా తిరిగి చూస్తూ కన్పించిన హోటల్లో భోజనంచేసే వారు. సరదాగా 'అదికావాలా, యిది కావాలా' అంటూ అనేకం కొన్నాడు సారథి. అయినా అతడు మనస్ఫూర్తిగా ప్రవర్తించడం లేనట్లు, తమ మధ్య దూరం తగ్గనట్లే భావించి బాధపడసాగింది రమణి.

ఒక రోజున ఒక షాప్ లో సారథి మిత్రుడు శేఖరం, అతడి భార్యా కన్పించారు.

"ఎమ్మెస్సీలో యితడు నా క్లాస్ మేట్" అంటూ శేఖరం సారథిని తన భార్యకు పరిచయం చేస్తూ "నా వైఫ్ లక్ష్మి, బి.ఎ." అని పరిచయం చేశాడు.

"హల్లో. వెరీగ్లాడ్ టు మీట్ యూ, వుయ్ హార్ట్లీ ఇన్వైట్ యు టు అవర్ హోమ్" అంది లక్ష్మి చలాకీగా.

"నా భార్య రమణి." అని చూపించాడు సారథి.

లక్ష్మి ముందుకువచ్చి 'షేక్ హాండ్' యిచ్చింది రమణికి, చిరునవ్వులు కురిపిస్తూ విస్ఫారిత నేత్రాలతో అవలోకించడంతో సరిపోయింది రమణికి. మాట్లాడలేకపోయింది.

ఇంటికి తిరిగి వచ్చాక అంది, "అదృష్టవంతులు. ఇద్దరూ గ్రాడ్యుయేట్. ఆవిడ చకచకా ఇంగ్లోషులో మాట్లాడేస్తోంటే కళ్ళప్పజెప్పి చూడాల్సి వచ్చింది."

సారథి ఏమీ మాట్లాడలేదు.

"ఇక యింట్లో వంట మొదలుపెడ్తాను" అంది రమణి ఒకనాడు తీరికగా, తమతో తెచ్చుకున్న వంట సామాను సంచీ విప్పుతూ.

"ఒద్దు. ఇలాగే బాగుంది. ఇంట్లో బాదరబందీ నువ్వు పడలేవు." అన్నాడు సారథి.

చిత్రంగా చూచింది రమణి. "హాస్యమా? అలా ఎంత కాలం సాగుతుంది?"

"అన్నట్టు, మర్చిపోయాను. ఆ అలమార్లో కవరుంది, తీసి చూడు."

ఆత్రతగా తీసి చూచింది రమణి – పి.యు.సీ.లో జేరడానికి అప్లికేషన్ ఫారమ్!

"ఎందుకిది?" ఆశ్చర్యంగా అడిగింది.

"నీకే"

"అర్థం కాలేదు."

సారథి చెప్పాడు. "చదువుమీద నీకు గల అభిలాష చాలా గొప్పది. అందుకే కాలేజీలో జేరి చదువుకో."

కలగంటున్నట్లనిపించింది రమణికి. "నా కిప్పుడు చదువేమిటి?" అంది నవ్వుతూ భర్త మాటల్ని నమ్మలేక.

"ఇప్పుడేమిటి, అప్పుడేమిటి? మానవుడెప్పుడూ విద్యార్థే ! అవకాశముండాలే కాని ఎపుడైనా చదువుకోవచ్చు."

"నిజంగా చదువుకోమనేనా ?" ఇంకా నమ్మలేకుండా వుంది రమణి.

"అవును రమణీ. నిజంగానే చెప్తున్నాను. మీ నాన్న గారు పెళ్ళి చేసేశారు. చదువు మాన్పించి. అక్కడ తండ్రీ – యిక్కడ భర్తా ఎవ్వరూ నీ కోర్కె తీర్చలేదని నువ్వు మూగబాధ అనుభవించకూడదు. నీ కోసమే నేనిక్కడికి ట్రాన్స్ ఫర్ చేయించుకొన్నది. లక్షణంగా కాలేజీలో జేరి చదువుకో. అందుకవసరమైన సర్టిఫికెట్లవీ తెప్పించుకో."

"అత్తగారూ వారూ ఏమంటారో !"

ఈసారి సారథి గొంతు కొంచెం కఠినంగా పలికింది. "ఎవరేమనుకొంటారన్నది కాదు ముఖ్యం. మన అంతఃకరణా ఆత్మతృప్తి ప్రధానం. మనం అక్కడి నుంచి యిక్కకొచ్చేటప్పుడే వాళ్ళనుకొన్నవన్నీ అనుకొన్నారు."

ఇంతమంచివారైన భర్త సహృదయాన్ని తాను అంతవరకు అర్థంజేసుకోలేక పోయినందుకు బాధపడింది రమణి. ఇటువంటి వ్యక్తి సాహచర్యం కంటె చదువు ముఖ్యమా – "యిప్పుడు చదువుకుని నేనేం జెయ్యాలి గనుక?" అని కూడా ఆలోచించింది ఆ పశ్చాత్తపంలో. కాని కాలేజీ, చదువూ, సహవిద్యార్థినులు, వివిధ రకాల కార్యకలాపాలూ, పోటీలు, ఆటపాటలూ – ఓహ్ ! కాలేజీ జీవితం, బంగారు జీవితం – ఊహాంబరంలో తారకయై సూదంటురాయిలా ఆకర్షించసాగింది!

కాలీజీకి వెళ్తోంది, వస్తోంది రమణి. అడిగినంత డబ్బుయిచ్చేవాడు సారథి. ఎందుకని మాత్రం ఎన్నడూ అడిగేవాడు కాదు. "కాలేజీ బాగుందా? పాఠాలు అర్థమౌతున్నాయా?" అని మాత్రం అడిగేవాడు. అప్పుడప్పుడూ.

ఇద్దరి దగ్గరా చెరోతాళం వుండేది. ఇల్లు శుభ్రం చేసి మంచి నీళ్ళు తెచ్చి, హోటలునుండి కారియర్ తేవడానికి ఒక మనిషిని తెచ్చి పెట్టుకున్నాడు. ఇద్దరి టైములూ ఒకటి కాదు. అతడి ఆఫీసు ఉదయం ఏడు నుండి మధ్యాహ్నం పన్నెండు వరకూ. తిరిగి ఒంటిగంట నుండీ నాలుగు గంటల వరకూ.

రమణి కాలేజీ పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, రెండు నుండి సాయంత్రం అయిదు గంటల వరకూ. ఒకసారి సాయంత్రం ఆటలవీవుండి రమణి యింటికి వచ్చేసరికి ఆరుకూడా దాటేది. ఆలస్యానికి కారణం ఎప్పుడూ సారథి అడగకపోవడం రమణికి వింతగా తోచేది.

రాత్రి ఎనిమిది గంటలకు హోటలు నుంచి వచ్చిన భోజనం సారథి రమణీ ఒకేసారి భుజించేవారు. ఏం మాట్లాడుకోవలసి వున్నా అక్కడే మాట్లాడుకొనే వారు. భోజనానంతరం రమణి తన పాఠాల ముందు కూర్చుంటే సారథి తన ఆఫీసు కాగితాలు చూసుకుంటూ కూర్చునేవాడు. ఆ పాఠాలలో పడి చదువుతూంటే టైము తెలిసేది కాదు రమణికి. ఎంత చదివినా యింకా చదవవలసినవనేకం మిగిలిపోయేవి. ఏ పదకొండు గంటలకో పన్నెండు గంటలతో ఆమె చదువు దగ్గర్నుండి లేచే సరికి సారథి సగం నిద్రలో వుండేవాడు. ప్రొద్దుపోయేవరకూ చదవడం వల్ల ఉదయం ఏడూ ఎనిమిది గంటలైతే కాని మెలకువ వచ్చేది కాదు రమణికి. ఆ సమయానికి సారథి ఆఫీసుకు వెళ్ళడానికి తయారౌతూండేవాడు; ఒక్కోసారి వెళ్ళిపోయే వాడు కూడా. ఫ్లాస్కులో కాఫీ, మూత పెట్టిన టిఫిన్ ఒంటరిగా ఆమె కోసం ఎదురు చూచేవి. మధ్యాహ్నం కాలేజీలోనే వుండి పోయి హాస్టల్ లో భోజనం చేసేది రమణి. సారథి ఆఫీసునుంచి హోటల్ కెళ్ళి తిరిగి ఆఫీసుకే వెళ్ళిపోయేవాడు. వారానికి యే ఒక్కరోజు మాత్రమో యిద్దరూ సాయంకాలం సకాలంలో తిరిగివచ్చేవారు యింటికి. ఆదివారాలు పూర్తిగా యింటిదగ్గరున్నా యిద్దరి మధ్యా మాటలు అరుదుగానే వూండేవి. అతడి స్వభావం ఏమిటో ఎంత ఆలోచించినా రమణికి అర్థం కాలేదు. తన ప్రతి కోరికా తీరుస్తున్నాడు. కాని ముభావంగా వుంటాడు. కోపమా అంటే అదీలేదు; ఎప్పుడు చూచినా అతడి ప్రశాంత వదనంలో చిరుదరహాసం వెల్లివిరుస్తూనే వుండేది.

ఒక సాయంత్రం రమణి అంది, “కాస్త అలా ఎటైనా వెళ్ళాలని వుండదా మీకు?”

“నీకు వెళ్ళాలని వుందా?” సారథి ఎదురు ప్రశ్న ఆమెకు చికాకు కల్గించింది. తిరిగి మాట్లాడలేదు.

“రా వెళ్దాం. నీకేమైనా చదువుకోవలసిన వుంటాయేమోనని నేను ఆ ప్రస్తావన తేవడం లేదు! పద, బీచ్ కి వెళ్దాం.” అంటూ దారి తీశాడు. అంతే, ఆ రోజు మట్టుకే! మళ్ళీ మర్నాటి నుండి మామూలే. రమణి అడుగలేదు. అతడు ఆధ్యాసవున్నట్టే వుండేవాడు కాదు. ఆఫీసు కాగితాలు చూచుకోవడం, లేకపోతే వీధివరండాలో కూర్చుని వచ్చేపోయే జనాన్ని నిర్విరామంగా తిలకించడం.

ఒక ఆదివారం రమణి స్నేహితులు ఇందిరా, కమలా వచ్చారు. భర్తకు పరిచయం చేసింది రమణి. చాలా ఆదరంగా మాట్లాడాడు సారథి. వారి మార్కులూ, పై చదువుల విషయంలో ఉద్దేశాలూ అడుగుతూ చాలా చనువుగా మాట్లాడాడు. కొద్దిసేపు పోయాక “మీరు మాట్లాడుకోండి” అని తన గదిలోకి వెళ్ళిపోయి సండే స్టాండర్డు తిరగవెయ్యసాగాడు.

ఓ గంటపోయాక రమణి వచ్చింది అతడి దగ్గరకు, “వాళ్ళు నన్ను సినిమాకు రమ్మంటున్నారు.” అంది.

“పర్సులో వుంది డబ్బు. తీసుకో.” అన్నాడు సారథి తలెత్తకుండానే.

రమణి కదలలేదు. అలాగే అతడి కుర్చీ వెనుక ఆనుకుని నిల్చుంది. రెండు నిముషాలు పోయాక సారథి తలెత్తాడు. “వెళ్ళు రమణీ, నా పర్సులో డబ్బు వుంది” అంటూన్న అతడికెందుకో రమణి ముఖం అదో మాదిరిగా కన్పించింది.

“వెళ్ళను. వాళ్ళని పంపించివేశాను.” అంది నేలవైపు చూస్తూ.

అర్థం కానట్టు చూచాడు సారథి.

“మనం యిక్కడికొచ్చి రెండునెలలైంది. వచ్చిన మొదటి వారంలో రెండు సినిమాలు చూశాం. మళ్ళీ యింతవరకూ చూడలేదు.” అంది.

సారథి వదనంలో ఆశ్చర్యం పొడ చూపింది. “క్రిందటి ఆదివారం వెళ్ళావుగా నీ స్నేహితులతోటి? అంతకు ముందు కూడ ఒక వారం ఏదో మార్నింగ్ షోకి వెళ్ళినట్టు నాకు గుర్తు.”

“అదికాదు నే ననేది.”

“మరి? నీ ధోరిణి నా కర్థంకావటం లేదు.”

“నా దారిన నేను పోవడం, మీ మట్టుకు మీ స్నేహితులతో కులాసాగా తిరగడం విషయం కాదు నే ననేది.” ఆమె అశ్రువులను బలవంతంగా అదిమిపెడ్తున్నట్టు గ్రహించాడు సారథి.

కొద్దిసేపు వూరుకుని, "నీ మట్టుకు నీవు వెళ్ళడం – అంతవరకే నిజం రమణీ. ఆ రోజున నీతో మినహా మరెప్పుడూ ఎక్కడికీ వెళ్ళలేదు నేను. ఇల్లూ ఆఫీసే నాకు లోకం." అన్నాడు మెల్లగా.

తనమాట తనకే తగలడంతో రమణి అభిమానం దెబ్బతిన్నది. "ఎందుకింత విరాగిగా వుంటున్నట్టు?" ఏ నాటి నుంచో అదిమి పెడ్తున్న కోపం ఒక్క మాటలో వెలువడిపోయింది.

సారథి జవాబివ్వలేదు.

"ఒక్క రూమ్ లో వుంటున్న యిద్దరు మిత్రులం మనం. అంతేనా? అంతకంటే మనమధ్య సంబంధం లేదా?'

"ఎందుకలా ఆవేశపడ్తావ్ రమణీ? విద్యార్థి దశలో జీవితం ఎలా వుంటుంది? చదువు, స్నేహితులు. అంతే. అదేలోకం. అంతకు మించిన బాధ్యత ఎవరైనా పైన వుంచబోయినా మనస్సు చికాకుపడ్తుంది. స్నేహితులెక్కడికైనా రమ్మంటారు. వాళ్ళ మాట తీసేస్తే బాగుండదు. సరే, చదువు ఒక సముద్రం లాగా ఎంత చదవినా తరగదు. ఇవిగాక నాతో షికార్లకూ సినీమాలకూ తిరగడానికి నీకు టైమువుండక పోవచ్చునని అనుకున్నాను. నీకు వెళ్ళాలని వుంటే–పద వెళ్దాం." అంటూ లేచి స్నానాల గదిలోకి వెళ్ళాడు. అతడు తిరిగి వచ్చేసరికి రమణి యింకా కుర్చీలోనే వుంది. శ్రావణ మేఘాలలా వర్షిస్తున్నాయి ఆమె నేత్రాలు. సారథి గమనించి కూడా చలించలేదు. ఆమెను చూడనట్టే దుస్తులు వేసుకోసాగాడు. తన మాటల ప్రభావం ఆమె పై ఎలాపని జేస్తుందో అతడు ముందే వూహించాడు. అందుకే అనేసి, అక్కడి నుండి తప్పుకొన్నాడు – తిరిగి ఆమెను లాలించి కరగి పోవలసిన అవుసరం నుండి తప్పించుకోవటానికి. కాని, ఆ ప్రభావం యింత సేపువుండగలదది అతడనుకోలేదు.

అతడు చూచీ చూడనట్టు తిరుగుతున్నాడని రమణి అనుమానపడింది. కాని నిర్ధారించుకోలేక పోయింది. అసలప్పుడిక పిక్చర్ కి వెళ్ళాలనే కోర్కెకూడా చచ్చిపోయింది. కాని యిప్పటికే నిగ్రహం లేనిదని భర్త భావించి వుండవచ్చు. అతడి దృష్టిలో మరీ చులకన కాకుండా వుండడానికి బలవంతంగాలేచి అతడి ననుసరించింది.

తన చదువు విషయంలో అత్తగారి మామగారి అభిప్రాయాలెలా వున్నాయో తెల్సుకోవాలని వుండేది రమణికి. కాని సారథి "అంతా క్షేమమేనట. ఉత్తరం వచ్చింది." అని చెప్పడం తప్ప ఎప్పుడూ ఒక్క ఉత్తరం కూడా యివ్వలేదామె చేతికి. రమణి గ్రహించుకోగల్గింది – బహుశః అత్తగారు తన విషయంలో నిష్టుర పడి వుంటుందని పుట్టింటినుంచి వుత్తరాలు వచ్చినా అవి కేవలం క్షేమ సమాచారాలు. బహిశః వారికి కూడ తన చదువు అంగీకారం కాదేమో !

క్వార్టర్లీ పరీక్షలు వచ్చాయి. శ్రద్ధగా చదవసాగింది రమణి. కాని ఎంత శ్రద్ధగా చదివినా ఎందువల్లనో దృష్టిని కేంద్రీకరించలేకపోయేది. ఒక్కో అరగంట, గంట కూడ ఏ ఆలోచనా లేకుండా ఏమిటో అలా పరధ్యానంగా గడిపేసేది. ముభావంగా వుండే భర్త కూడ "బాగా చదువుకో రమణీ." అని మధ్య మధ్య హెచ్చరించేవాడు. రాత్రి స్వయంగా హోటలుకెళ్ళి ఫ్లాస్కులో కాఫీ పోయించుకొచ్చి రమణి టేబుల్ మీదుంచేవాడు. ఆమె తిరిగి ఉదయం త్వరగా లేవటానికి నాలుగున్నరకు తనే 'అలారమ్' పెట్టేవాడు. ఇవన్నీ చూస్తుంటే ఏమిటో రమణి మనస్సు తనకే తెలియకుండా అయిపోయింది.

పరీక్షలైపోయాయి. "సెలవులకిక్కడే వుందామా ? ఎటైనా వెళ్దామా ?" అడిగింది రమణి.

"మీ వాళ్ళింటికి వెళ్తావా?"

"ప్రత్యేకంగా మీవాళ్ళంటారేం? మీరు రారా? ఇక్కడో నాల్గురోజులు, అక్కడో నాల్గురోజులు ఉండి వద్దాం."

"------------------------------.."

"ఏం? అత్తగారు నా పై కోపంగా వున్నారా?"

అప్పటికీ సారథి మాట్లాడలేదు. చిరునవ్వే సమాధానమైంది'

"పోనీ ఎటైనా తిరిగి వద్దాం."

మెల్లగా అన్నాడు సారథి. "ఇంటి దగ్గర్నుంచేమీ తెప్పించుకోవటం లేదు రమణీ ! నా జీతంతోనే గడుపుకొస్తున్నాను ! నాకు ప్రమోషన్ ఏమైనా రావాలి ! నీ కోర్కెలు తీర్చాలి !!

అంతవరకూ రమణికి డబ్బు విషయం ఎన్నడూ తట్టనేలేదు. అతడికొచ్చే మూడు వందలలోనే తన కాలేజీ చదువుతో సహా అన్నీ లోటులేకుండా గడిపేస్తున్నాడు !

“మరీ అంత ముభావంగా వుంటారేమిటి. నా వల్ల పెద్ద అపరాధం జరిగినట్టు? ఉన్న విషయాలు నాతో సరసంగా చెప్పవచ్చుగా?” అంది రమణి.

తేలికగా నవ్వాడు సారథి. “ముభావత ఏమీ లేదు. నువ్వు పదిహేనువేలు పోసి కొనుక్కున్న పదార్ధాన్ని నేను. అందువల్ల నీ కనుగుణంగా నడుచుకోవడం నా విధి.”

ఆ సమాధానం వినడంతో కరగుతూన్న రమణి హృదయం తిరిగి కరడు కట్టుకుపోయింది.

కాలేజీలు తెరిచారు. రెండుమూడు సబ్జక్టులలో తప్ప మిగిలినవన్నీ పాతిక పర్సెంటు కూడా రాలేదు రమణికి. భర్త ఏమంటాడు? ఏముఖంతో ఈ మార్కులతనికి చూపించేది? కాని చూపక తప్పలేదు. ప్రోగ్రెస్ రిపోర్టు పై సంతకం చేస్తూ “ఇంకా క్రొత్తకదూ ? ఈసారి బాగా వస్తాయేమోలే.” అన్నాడు సారథి. “ట్యూషన్ కావాలా ?” అని కూడా అడిగాడు. రమణి తలెత్తలేకపోయింది. “నీకేం పనా పాటా ? ఇంత తక్కువ మార్కులెందుకు రావాలి? ఈ మాత్రం దానికీ చదువెందుకు?” అని సాధిస్తాడనుకుంది. కాని అతడలా అనకపోవడమే ఆమెకు బాధగా పరిణమించింది.

“ఏమిటో పుస్తకాల పై దృష్టి నిలవడం లేదు.” అంది.

అదొక మాదిరిగా నవ్వాడు సారథి. “పోనీ ఎవరితోనైనా కంబైన్డ్ స్టడీస్ సాగించు.”

రమణి మాట్లాడకుండా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

శనివారం రాత్రి రమణి హాండ్ బాగ్ అవీ సర్దుకుంటోంది. పడుకుంటూ సారథి అన్నాడు. “ఆ రోజు మనకు షాప్ లో కన్పించాడు శేఖర్ అని నా ఫ్రండూ, అతడి భార్యా – గుర్తున్నారా రమణీ?”

“ఆ.. లేకేం ? బాగున్నారా?” అడిగింది రమణి.

“ఇవాళ కన్పించాడు. రేపు భార్యను తీసుకొస్తాడట మనింటికి.

“రేపే?” ఖంగారుగా అడిగింది రమణి.

“ఏం?”

“రేపు మా స్నేహితులందరం పిక్నిక్ వేసుకున్నాం. ఎలా? అందుకే యివన్నీ సర్దుకుంటున్నాను. వెళ్ళకపోతే ఇందిరా వాళ్ళూ హేళన చేస్తారు.

“పోనీ అలాగే వెళ్ళు. యిదేమంత పెద్ద సమస్య?” అన్నాడు సారథి తేలికగా. ఆశ్చర్యపోయింది రమణి. తనకెంతో సమస్యలలా కన్పించినవాటిని అతడు నవ్వుతూ నవ్వుతూ తేలికగా తేల్చివేస్తాడు.

మర్నాడు క్లాసులో ఇందిరనడిగింది రమణి. “నిన్న పిక్నిక్ కు రాలేదేమే నువ్వు?” సిగ్గుపడ్తూ చెప్పింది ఇందిర. “తన స్నేహితులెవరో వస్తున్నారు. పరిచయం చెయ్యాలని వుండిపొమ్మన్నారు మా బావ.”

“బావంటే?”

“కాబోయే శ్రీవారే! మన యింగ్లీష్ లెక్చరర్” అని సందేహం తీర్చింది కమల.

నిర్ఘాంతపోయింది రమణి. కాబోయే భర్త కోరికకు కట్టుబడిపోయింది ఇందిర! తన కోరికలన్నిటినీ అపురూపంగా తీర్చుతున్న భర్త అభ్యర్ధనను తాను మన్నించలేకపోయింది. భర్త స్నేహితుడు భార్యాసమేతంగా అతిధిగా వస్తోంటే భార్యకు ముందుగా తెలిసే ఆ సమయానికి యింట లేకుండా వెళ్ళిపోయిందంటే – ఆ అతిధులేమనుకొన్నారో? భర్త ఎంత హేళనకు గురయ్యాడో! ఇందిరావాళ్ళూ ఎంతో షోగ్గా, సోషల్ గా తిరుగుతారనీ వాళ్ళలా వుండాలనీ తన తాపత్రయం. కాని ఎవరి పరిస్థితి కనుగుణంగా వాళ్ళుండాలని యివ్వాళ ఇందిర ప్రవర్తన తనకొక గుణపాఠం నేర్పిందన్న మాట!

తనూ, తనవారూ – తర్వాతే పైవారు. ఈ సత్యం యివ్వాళ యింకా పెళ్ళికాని ఇందిర నుండి తను నేర్చుకోవలసిరావడం తనకే చిన్నతనమనిపించింది. ఆ విషయాలన్నీ యింటికి వచ్చి దాచుకోకుండా భర్తకు చెప్పేసి, క్షమాపణ కోరుకోవాలనిపించింది. కాని తీరా యింటికి వచ్చేసరికి సారథి ముభావం చూచి ఏమీ మాట్లాడాలనిపించలేదు.

ఒక నెల గడిచింది. ఒక రోజున రమణి తల్లీ తండ్రీ దిగారు. చూచిపోవడానికి. తల్లికి ఏమీ నచ్చలేదు రమణి గృహవిషయం. "పెళ్ళయ్యాక లక్షణంగా సంసారం చేసుకోక ఎందుకు నీకీ చదువు? హోటలు మెతుకులు తింటూ, ఇల్లంతా గడ్డిమేటులా చిందరవందరగా చేసుకుని ఎందుకీ అవస్థ?" అని చాటుగా సాధించింది కూతుర్ని.

"అవును, నాకింకా చదువుకోవాలనుంది మొర్రో అంటూంటే పెళ్ళి చేసేశావు. ఆయన మంచి వారు గనుక చదువుకోనిస్తున్నారు. ఇప్పుడేం తక్కువ మాకు? హాయిగా వున్నాం" అంది బింకంగా రమణి.

రెండురోజులుండి తల్లీతండ్రి వెళ్ళిపోయారు.

ఒక సాయంత్రం ఆఫీసు నుండి వచ్చిన సారథితో చెప్పింది రమణి, "రేపు మా హిస్టరీ లెక్చరర్ కు మనింటి దగ్గర చిన్న టీ పార్టీ యివ్వదలచుకున్నాను. ఆవిడకు ట్రాన్స్ ఫరైంది. ఆవిడకూ నాకూ చాలా స్నేహం. ఓ పద్దెనిమిదీ యిరవై మందికంటే ఎక్కువుండరు గెస్ట్."

"ఊ(." వూ కొట్టాడు సారథి.

"తలూపితే కాదు, పార్టీకవసరమైన ఏర్పాట్లన్నీ చేసిపెట్టాలి మీరు."

"సరేలే" అని సారథి పనిమనిషికి చీటీ వ్రాసిచ్చి పంపి ఆఫీసునౌఖర్ని రప్పించాడు.

"ఇతడికి చెప్పి చేయించుకో నీక్కావలసినవన్నీ." అని పడుకున్నాడు సారథి.

"ఓ ! అవి నౌఖరుచేసే పనులు కాబోలు! తను చెయ్యడం నామర్దా అవుతుందేమో?" అనుకొంది లోలోపల. పైకి మాత్రం "అలా పడుకున్నారేం?" అనడిగింది.

"కొంచం తలనొప్పిగా వుంది, అమృతాంజనం యిలా తీసుకొస్తావా?"

సీసాతెచ్చి సారథి చేతికిచ్చి కుర్చీలో కూర్చుంది రమణి. "ఆవిడ భర్త కూడా మా కాలేజీలోనే ఎకనామిక్స్ లెక్చరర్. ఇద్దరూ ఎంత మంచివాళ్ళనుకున్నారు? వాళ్ళది 'లవ్ మారేజ్' అట!" అని చెప్పుకుపోతున్న రమణిని చూచి నిట్టూర్చుతూ మందు కణతలకు రుద్దుకుని అటు తిరిగి పడుకున్నాడు సారథి.

మర్నాడు ఉదయమే స్నానమైనా చెయ్యకుండా ఆఫీసు దుస్తులు వేసుకు వెళ్ళిపోతున్న సారథిని వింతగా విసుగ్గా చూచింది రమణి. "ఏం వెళ్ళిపోతున్నారు? ఇవాళ సెలవు పెట్టకూడదూ?" అడిగింది.

"ఆ, టైము కొచ్చేస్తాన్లే" అని వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం రెండు గంటలకు ఆఫీసు నౌఖరు వచ్చి "అయ్యగారు యిక్కడ ఏర్పాట్లన్నీ చూడమన్నారండి. ఆయనకు రావటానికి తీరికలేదట. ఆలస్యంగా వస్తారట." అన్నాడు.

మొదట డీలాపడిపోయింది రమణి. తర్వాత మెల్లమెల్లగా కోపంతో రగులుకుపోయిందామె హృదయం. "ఖాళీ లేకపోవటం కాదు, ఆ రోజు తన స్నేహితుడొచ్చేవేళకు లేకుండాపోయానని యివ్వాళ ఈ ప్రతీకారం." అనుకొంటూ తలపంకించింది. "పోనీ తనులేనంత మాత్రాన ఆగిపోతుందా?" అని కూడా అనుకుంది ఆ వేడిలో. అలాగే జరిగింది కూడా. టీ పార్టీ చాలా సంతోషంగా జరిగింది. ఆ తర్వాత అందరూ సినీమాకు వెళ్ళిపోయారు.

రాత్రి రమణి తిరిగి వచ్చేసరికి "టీ పార్టీ బాగా జరిగిందా? సినీమాకు వెళ్ళారా?" అని చిరునవ్వుతో పలుకరించాడు గదిలో పడుకుని వున్న సారథి.

"ఆ, బాగానే జరిగింది. ఎవరికోసమూ ఆగిపోలేదు." అక్కసంతా వెళ్ళగక్కి మరో గదిలోకి పోయింది రమణి.

మర్నాడు ఏడుగంటలకు రమణి లేచేసరికి సారథి యింకా లేవలేదు. అతడెప్పుడూ ఉదయం ఆరుగంటలకే లేస్తాడు. ఎంచేత లేవలేదో మరి ! తొమ్మిదైనా సారథి లేవలేదు. కాలేజీకి తయారౌతూ యికవుండబట్టలేక అతడి గదిలోకి వెళ్ళింది రమణి.

సన్నగా మూల్గు విన్పించింది ! తలవరకూ వున్న రగ్గును తొలగించి చూచింది రమణి ఆత్రంగా. శరీరమంతా ఒణికి పోతోంది; ఏనాటనాల్గో వుండొచ్చు జ్వరం. ఒళ్ళు ప్రేలిపోతూంది. స్పృహకూడా లేదు. అప్రయత్నంగానే రమణి నేత్రాలు వఱదలయ్యాయి. నిలువునా కంపించిపోయింది. త్వరగా డాక్టర్ దగ్గరకు పరుగెట్టించింది నౌఖర్ని.

"మలేరియా జ్వరం. ఫర్వాలేదు. సాయంత్రానికి కొంత నెమ్మదిస్తుంది." అన్నాడు డాక్టర్.

అన్నట్టుగానే సాయంత్రానికి శరీరోష్ణోగ్రత కొంచెం తగ్గింది. మెల్లగా కళ్ళుతెరచిన సారథికి ఎదురుగా రమణి శోకదేవతలా కన్పించింది. అతడి హృదయం గిలగిలలాడింది. "ఏం రమా? ఏమిటి? ఏమైన ఖంగారు పెట్టానా?" అనడిగాడు ఆత్రంగా.

కళ్ళుతుడుచుకుంది రమణి. "ఇప్పుడెలా వుంది? ఎపుడొచ్చింది జ్వరం?" అంది క్రాఫ్ సరిజేస్తూ. వెక్కిళ్లు మాత్రం తగ్గలేదు.

"ఫర్వాలేదు రమణీ. తగ్గిపోతుందిలే. భోజనం చేశావా? ఇప్పుడు టైమెంతైంది?"

రమణికికూడా అప్పుడు టైము విషయం గుర్తుకొచ్చింది. సాయంత్రం నాలుగు! ఉదయం నుంచీ అలాగే కూర్చుని వుందన్న మాట! భర్త ఎంత బలవంతం చేసినా రమణి భోజనం చేయలేదు. కాస్త కాఫీ త్రాగి, అతడికి పళ్ళ రసం యిచ్చింది. ఆమెకు భోజనం మీద, తన ప్రవర్తన మీద, తన మీద కూడ అసహ్యం కలిగిందా సమయంలో. ఎంత ప్రయత్నించినా కన్నీటి స్రవంతి కట్టువడడం లేదు.

"రాత్రే వచ్చిందా జ్వరం? నాకు చెప్పారు కాదేం?" అనడిగింది నుదురు అయిస్ బాగ్ తో ఒత్తుతూ.

"లేదు రమణీ. మొన్న సాయంత్రమే వచ్చింది. అందుకే టీ పార్టీ ఏర్పాట్లు చెయ్యడానికి ప్యూన్ ను పిలిపించాను. అదే తగ్గిపోతుందని నిర్లక్ష్యం చేశాను. నిన్న తెల్లారేసరికి మరీ భారంగా వుంది. జ్వరంవాడిని నేనింట్లో వుంటే నువ్వుదిగులు పడ్తావు; టీ పార్టీ సంతోషప్రదంగా జరగదనుకుని వెళ్ళి హోటల్ రూమ్ లో పడుకున్నాను. డిస్పెన్సరీకెళ్ళి ఏదో మందు త్రాగాను కాని పనిజేసినట్టు లేదు." అన్నాడు నీరసంగా నవ్వుతూ.

తలతిరిగి పోయింది రమణికి! భోరున అతడి పై పడి ఏడవటం మినహా మాట్లాడలేకపోయింది రమణి. సహృదయంతో అతడు చేసిన పనికి తన తెలివితక్కువ మనస్సెంత కల్మషంగా వూహించిందో తలచుకుని తలచుకుని కుమిలిపోయింది. జ్వరంతో వున్న మనిషి – రాత్రి వేళ ఏ దాహం వేసిందో, ఏమవసరం కలిగిందో? తానేమీ పట్టించుకోక పోయింది. అయినా అతడికి కోపం లేదు. అతడి పెదవులపై ఎప్పటివలె చిరుదరహాస చంద్రికలు మెరుస్తూనే వున్నాయి. కాని భగవంతుడు క్షమిస్తాడా తనను? ఇంతటి ప్రేమమూర్తిని భర్తగా పొందిన మరే స్త్రీయైనసరే పువ్వులతో పూజించుకొని ఆరాధిస్తుంది. తనలా ఎవ్వరూ నిర్లక్ష్యం చేసుకోరు.

రమణి పైకి ఏమీ మాట్లాడకపోయినా ఆమె ఎదలో రేగిన కల్లోలాగ్ని గ్రహించగలిగాడు సారథి. ఆ ఆవేశమంతా అశ్రురూపంతో బయల్పడడమే మంచిదనుకున్న సారథి మౌనం వహించాడు. అటువంటి సమయంలో మౌనమే మంచి ఓదార్పుకూడ!

సారథి జ్వరం తగ్గడానికి వారం రోజులు పట్టింది. ఆ వారం రోజులూ అతడెంత చెప్పినా వినకుండా రమణి కాలేజీ మానేసి అహోరాత్రులు అతది సన్నిధినే గడిపింది. 'నర్సింగ్ హోమ్' లో జేర్తానన్న సారథి మాటలకు "నేను బ్రతికే వున్నాను." అని కటువుగా సమాధానమిచ్చింది. సారథి నవ్వుకున్నాడు. మరి మాట్లాడలేదు.

మరొక వారం గడిచింది. "ఇక నాకు బాగా ఓపిక వచ్చింది రమణీ. నువ్వు కాలేజీకి వెళ్ళు. రెండు రోజులు పోయాక నేనూ ఆఫీసుకు వెళ్ళగలను." అన్నాడు.

బత్తాయి రసం తీస్తున్న రమణి మాట్లాడలేదు. విన్పించలేదేమోనని మళ్ళీ చెప్పాడు సారథి.

మెల్లగా తలెత్తింది రమణి. "ఇక వెళ్ళదల్చుకోలేదు. మానేశాను చదువు. చదువులెన్నైనా వుంటాయి. కాని గడచిపోతున్న ఈ ఒక్కొక్క బంగారు క్షణం తిరిగిరాదు."

"రమణీ !" ఆశ్చర్యంగా సారథి అన్నాడు.

"అవును. ఆశ్చర్యపోకండి." నిదానంగా అంది రమణి. "ఇప్పుడు నేను ఆ తెలివి తక్కువ రమణిని కాను. విద్య విజ్ఞానార్థం. వివేకంలేని విద్య ఎంత అభ్యసించినా ఒకటేనని గ్రహించాను. ఏ విద్యైనా, ఎటువంటి విజ్ఞానమైనా తననూ తన వారికీ ఆనందకరంగా వుండాలి కాని అనర్థహేతువు కాకూడదు. ఏ చదువూ యివ్వలేని వివేకాన్ని ఈ పదిరోజులూ మీ సేవలో, దైవతుల్యమైన మీ సహృదయాన్నర్థం జేసుకోవడంలో పొందగలిగాను."

దీర్ఘంగా తేలికగా నిట్టూర్చాడు సారథి. "చాలా సంతోషం రమణీ. హృదయాలర్థమైనాక మాటలు అనవసరం. కానీ ఒక సంగతి. ఇంతకాలం మనమధ్య దూరం వల్ల చెప్పలేకపోయాను. నీకు యింకా చదువుకోవాలన్న కాంక్ష, అసంతృప్తీ ఎలా అంతర్గతంగా వుండేవో, కొంతకాలం నాకూ అలాగే విదేశాలు వెళ్ళాలనీ, ఈ వుద్యోగపు బాదరబందీలో అప్పుడే చిక్కుకోకుండా యింకా యేమేమో చదవాలనీ వుండేది. కానీ నాన్నగారి అనంగీకారం వల్ల నా

ఆశలు నెరవేరలేదు. నేను చాలా బాధపడిన మాట నిజం. కాని ఎవర్నీ నిందించలేదు. కోరినవన్నీ అందవనే సత్యం గ్రహించాను. పరిస్థితులతో సమన్వయ పడిపోయాను. ఆ సమన్వయమే నీ హృదయంలో కొంత ఆలస్యంగా కుదురుకుంది.”

“అవును.” కృతజ్ఞతా పూర్వకంగా అంది రమణి. “ఇన్ని తెల్సినవారు గనుకనే నా మూర్ఖత్వాన్నంత సహనంతో నెట్టుకొచ్చారు. మీ ఓర్పుతోనే నాకొక గుణపాఠం నేర్పారు. భగవత్సృష్టిలో రకరకాల రంగురంగుల పుష్పాలు విరుస్తాయి. వాటిమట్టుకు వాటి కెన్నో కోర్కెలూ, ఆశలూ వున్నా, వాటి వాటి మనోభీష్టానుసారం మాత్రం జరుగదు. బహుశః అవన్నీ కూడా భగవత్పాదారవిందాల వద్ద చరితార్థం పొందాలని కోరుకుంటాయి. కాని అలా జరగదనడం పరమసత్యం. కొన్నింటి ఆశయం మాత్రమే సిద్ధిస్తుంది. కొన్ని నిరర్థకంగా వాడిపోతాయి. కొన్ని మాలగా ఏర్పడి కోమలలు కురులనలంకరిస్తాయి. మానవుడు వాని యిష్టాయిష్టాలు గ్రహించకుండా రంగు రంగుల పూలతో కంటికింపుగా కన్పించే మాల కూర్చుకు మురిసినట్టే ఈ మానవ కుసుమాలతో భగవంతుడు మాల అల్లి మెడలో వేసుకుంటాడు. ఆశయం సిద్దించలేదని అసంతృప్తితో ఆరాటపడి అలమటించేకంటే ఆ చిత్రమైన దండలోనే ముక్తీ మోక్షమూ అని తెల్సుకొంటే ధన్యులం.”

సంపూర్ణ జ్ఞానవికసిత హృదయం నుండి వెలువడిన ఆ మాటలకు ఆమోదపూర్వకంగా మధుర దరహాస మొనర్చాడు సారథి.

★ ★ ★ ★ ★ ★ ★ ★

COMMENTS